## 30 వరకు ఓటరు నమోదు చేపట్టాలి

**• బీఎల్ఓలకు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశం**



బీఎల్ఓల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, చిత్రంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి విక్టర్

అబిడ్స్, అక్టోబర్ 26 : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు బీఎల్ఓలు ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపట్టాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పేర్కొన్నారు. హిందీనగర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో గోషామహల్ నియోజకవర్గ బీఎల్ఓలతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి. విక్టర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దివ్యాంగులు పోస్టల్ బ్యాలెట్ వేసేందుకు వారికి 12డీ ఫారాలను అందజేయాలని ఆదేశించారు. అదేవిధంగా నూతనంగా ఓటు నమోదు కోసం ఈనెల 30 వరకు అవకాశం కల్పించడంతో ఫామ్-6 ద్వారా నూతన ఓటర్ల నమోదు చేపట్టాలని సూచించారు. బీఎల్ఓలు ఇంటింటికీ తిరిగి ఓటరు స్లిప్పుల పంపిణీ చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి విక్టర్, వీఆర్ఓ, జీహెచ్ఎంసీ 14వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ బాలయ్య, వీఆర్ఓలు, నాంపల్లి తాసీల్దార్ ప్రేమ్‌కుమార్, జీహెచ్ఎంసీ యూసీడీ పీఓ విద్యాసాగర్, బీఎల్ఓలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

## ఎంపీ జోగినపల్లిని కలిసిన నేతలు



రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మామ మజ్జిగ నరసింహయాదవ్ సంతాప సభ గురువారం జరిగింది. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్‌కుమార్‌ను గన్‌ఫౌండ్రి డివిజన్ మాజీ కార్పొరేటర్ మమతా సంతోష్‌గుప్తా దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. – అబిడ్స్, అక్టోబర్ 26

## సన్మానం



టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేనీని గురువారం టీఎన్జీవో స్కూల్ ఎడ్యుకేషన్ యూనిట్ అధ్యక్షుడు కేఆర్ రాజ్‌కుమార్ శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా శాఖ ఉపాధ్యక్షుడు కురాడి శ్రీనివాస్, కార్యవర్గ ముఖ్యులు ఖాలేద్ అహ్మద్, వెంకట్‌రెడ్డి, దేవేందర్, డేవిడ్, ఫిరోజ్ అహ్మద్, సభ్యులు పాల్గొన్నారు.

– సుల్తాన్‌బజార్, అక్టోబర్ 26

## తెలంగాణ విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మహిళా సంఘం కార్యదర్శిగా అనూరాధ



బి.అనూరాధ

రవీంద్రభారతి, అక్టోబర్ 26 : విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మహిళా సంఘం తెలంగాణ కార్యదర్శిగా హైదరాబాద్ వాస్తవ్యులు బీబీనగర్ అనూరాధ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం ఆ సంఘం అధ్యక్షుడు డాక్టర్ వేములవాడ మదన్‌మోహన్ మాత్రు సంఘం కార్యాలయంలో అనూరాధకు నియామకపత్రాలు అందజేసి మాట్లాడారు. అనూరాధ పదవీకాలం రెండేండ్ల వరకు వర్తిస్తుందని చెప్పారు. విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మల సంక్షేమానికి కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు వెంకటాచారి,ప్రధాన కార్యదర్శి కృష్ణమాచార్యులు,లక్ష్మీరామాచారి, మహిళా సంఘం నేతలు పాల్గొన్నారు.

# నర్సింహయాదవ్‌కు ఘన నివాళి



మజ్జిగ నర్సింహయాదవ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న హోంమంత్రి మహమూద్అలీ, రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్‌కుమార్, చిత్రంలో మంత్రి తలసాని



నర్సింహయాదవ్ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, చిత్రంలో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

అబిడ్స్, అక్టోబర్ 26 : రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ మామ, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు మజ్జిగ నర్సింహయాదవ్ సంస్మరణ సభ గురువారం నాంపల్లిలోని రెడ్‌రోజ్ ఫంక్షన్‌హాల్‌లో జరిగింది. హోంమంత్రి మహమూద్‌అలీ, రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్‌కుమార్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఎమ్మెల్యేలు రాజాసింగ్, దానం నాగేందర్, కాలేరు వెంకటేశ్, మాగంటి గోపినాథ్, మాజీ ఎమ్మెల్యే ప్రేమ్‌సింగ్ రాథోడ్, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి తలసాని సాయికిరణ్ యాదవ్, నేతలు ఆనంద్‌గౌడ్, ఆల పురుషోత్తం, రామచంద్రరాజు, సంతోష్‌గుప్తా, మమతగుప్తా, శాంతిదేవీ, ధన్‌రాజ్, ప్రకాశ్ గుప్తా తదితరులు హాజరై దివంగత నర్సింహయాదవ్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం నర్సింహయాదవ్ కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. నర్సింహయాదవ్ స్వాతంత్ర్య పోరాటంలో అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు.

# ఇందిరానగర్‌లో పోలీసుల కార్డన్ సెర్చ్

**• 271 నివాసాల్లో తనిఖీలు**
**• ధ్రువపత్రాలు సరిగా లేని 46 వాహనాలు స్వాధీనం**
**• ముగ్గురు రౌడీషీటర్ల బైండోవర్**



ఇందిరానగర్‌లో వాహనాలను తనిఖీ చేస్తున్న సౌత్‌వెస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి,అదనపు డీసీపీ అష్ఫక్, ఏసీపీలు

అబిడ్స్, అక్టోబర్ 26 : అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా గోషామహల్ డివిజన్ పరిధిలోని ఇందిరానగర్‌లో గురువారం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ బీ. బాలస్వామి పర్యవేక్షణలో అదనపు డీసీపీ అష్ఫక్, గోషామహల్ ఏసీపీ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆసిఫ్‌నగర్ ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి, కుల్సుంపురా ఏసీపీ జావీద్, గోల్కొండ ఏసీపీ ఫయాజ్, మంగళ్‌హాట్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, పలువురు ఇన్‌స్పెక్టర్లు, 120 మంది పోలీసులు దాదాపు నాలుగు గంటల పాటు సోదాలు నిర్వహించారు. ఇందిరానగర్‌లోని 271 నివాసాల్లో తనిఖీలు నిర్వహించి 8.8 లీటర్ల మద్యం, 1150 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 46 వాహనాలను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అదే విధంగా నకుల్ పంచ్‌లు కలిగిన ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఇదిలా ఉంటే ఆరు నెలలుగా పోలీసులకు చిక్కకుండా తిరుగుతున్న ముగ్గురు రౌడీషీటర్లను అదుపులోకి తీసుకుని బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా గోషామహల్ ఏసీపీ వెంకట్‌రెడ్డి, మంగళ్‌హాట్ ఇన్‌స్పెక్టర్ ఎ రవికుమార్ మాట్లాడుతూ కార్డన్ సెర్చ్‌లో ఇందిరానగర్‌లోని 271 ఇండ్లను క్షుణ్ణంగా తనిఖీలు చేసి సరైన పత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకుని, అనుమానితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో నిత్యం తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించకుండా పూర్తి స్థాయిలో నిఘా ఏర్పాటు చేశామని, అదే విధంగా రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు.

## కురుమ కులస్తులకు అన్ని పార్టీలు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కురుమ సంఘం నాయకులు

రవీంద్రభారతి, అక్టోబర్ 26 : రానున్న ఎన్నికల్లో అన్ని పార్టీలు కురుమ కులస్తులకు ఎమ్మెల్యే టిక్కెట్లు కేటాయించి రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని రాష్ట్ర కురుమ సంఘం నేతలు అన్నారు. గురువారం తెలంగాణ కురుమ సంఘం ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర కురుమ సంఘం యూత్ అధ్యక్షుడు దొడ్డి శ్రీనాథ్‌కురుమ, బీసీ సంక్షేమ సంఘం నేత ఎర్ర సత్యనారాయణ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కురుమ కులస్తులకు బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలన్నారు. కురమ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి, నిధులు కేటాయించాలని సీఎం కేసీఆర్‌ను కోరారు. కురుమ సంచార జాతులుగా కొనసాగుతూ అడవిలో ఉండి జీవాలను పెంచుతూ జీవిస్తున్నామన్నారు.

గోషామహల్, నాంపల్లి నియోజకవర్గంలో కురుమ కులస్తులు అధిక సంఖ్యలో ఉన్నందున గోషామహల్ టిక్కెట్‌ను బేజిని శ్రీనివాస్ కురుమకు కేటాయించాలని సీఎం కేసీఆర్‌ను, నాంపల్లి ఎమ్మెల్యే టిక్కెట్‌ను దేవర శ్రీనివాస్‌కు కేటాయించాలని బీజేపీ అధిష్టానాన్ని కోరారు. వారి వెంట కురుమ సంఘం నేతలు మాదారపు కృష్ణకురుమ, విజయానంద్ కురుమ, అశోక్ కురుమ తదితరులు ఉన్నారు.

## సంతోష్‌నగర్‌లో పాతకక్షలతో యువకుడి దారుణహత్య

మాదన్నపేట, అక్టోబర్ 27 పాత కక్షలతో గుర్తు తెలియని వ్యక్తులు ఓ యువకుడిని దారుణంగా హతమార్చిన ఘటన సంతోష్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంతోష్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఈది బజార్‌కు చెందిన ఘనీ ఖురేషి స్థానిక గౌసియా మసీదు వద్ద మటన్ షాప్ నడుపుతున్నాడు. గురువారం మధ్యాహ్నం తన కుమారుడు నవీద్ ఖురేషీ(19)ను దుకాణంలో ఉంచి ఘనీ ఖురేషి భోజనం చేసేందుకు ఇంటికి వెళ్లాడు. ఈ క్రమంలో 3.30 గంటల ప్రాంతంలో దుకాణం పక్కనున్న వ్యక్తి ఫోన్ చేసి నవీద్‌ను మొయిజ్ అనే వ్యక్తి కత్తితో పొడిచి పారిపోయాడని, ఒవైసీ అసుపత్రికి తీసుకెళ్తున్నామని తెలియజేయడంతో అయన హుటా హుటిన ఆసుపత్రికి వెళ్లాడు. ఆసుపత్రికి వెళ్లి చూసేసరికి తన కుమారుడు మృతి చెంది ఉన్నాడని ఘనీ తెలిపారు. గతంలో నవీద్, మొయిజ్ అతడి స్నేహితులు శాలిబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తిపై కత్తితో దాడి చేశారు. అప్పటి నుంచి మోయిజ్‌కు తన కుమారుడికి గొడవలు జరుగుతున్నాయని, ఇదే విషయమై నవీద్‌ను హత్య చేసి ఉంటారని మృతుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని క్లూస్‌టీమ్‌ల సాయంతో పోలీస్ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

హంతకులను త్వరలోనే పట్టుకుని పూర్తి వివరాలు తెలియజేస్తామని పోలీసులు తెలిపారు. ఈ హత్యతో ఆ ప్రాంతంలో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు.